# అచ్చమ్మ కల

"ఆహుం! ఆహుం! ఆహుం!"

ఆ ముగ్గురు శ్రమ జీవుల కంఠ నాళాల నుండి ఉబికి వస్తున్న ప్రణవ నాదాలు అవి.

ఆ ముగ్గురమ్మలు రూపమెత్తిన ధాన్యలక్ష్మమ్మల్లా ధ్యానం దంచుతూనె ఉన్నారు.

"పొద్దుగాల మొదలెట్టినామాయె! పొద్దు నడినెత్తిమీదికొచ్చేసిందాయె. ఓ ముద్ద తిని తిరిగి పోటేత్తేపాయె!"

"ఎర్రచ్చమ్మా! నూ సెప్పినాది నిజమే! ఈరమ్మా! లెగు!" తోట అచ్చమ్మ మాటలకి ఆ ఇద్దరు పోటాపారు రోకళ్ళు మూడు పక్కగా గోడవార పెట్టారు.

ముగ్గురు పెరట్లోకి వచ్చి తెచ్చుకున్న మూటలు విప్పారు. జర్మన్ సిల్వర్ కంచాల్లో అన్నం, ఉల్లిపాయ తొక్కువేసుకుని తిన్నారు. ఇంటియజమానురాలు అక్కడ పెట్టిన మంచినీళ్ళ చెంబు అందుకుని చెంబులో నీళ్లు నోట్లో ఎత్తిపోసుకుని గట గటా తాగేసారు. తిన్న సిల్వరు పళ్ళాలు గడిగేసి తిరిగి బట్టల్లో చుట్టి వారగా పెట్టుకున్నారు.

ఎర్రచ్చమ్మ మొల సంచీలో నుంచి చిన్న పొగాకుచుట్ట తీసి, "అగ్గి పెట్టెక్కడా?" అంది.

"దానికేటి నా కాడ ఉంది" వీరమ్మ తన మొల సంచీలో నుంచి మరో చుట్ట అగ్గిపెట్టి తీసింది.

"నీ కాడా లేదా నేనియ్యనా?" అడిగింది వీరమ్మ.

"నా కాడా ఉన్నది". తోటచ్చమ్మ కూడా మొల్లో దోపుకున్న సంచీలోంచి చుట్టతీసింది.

ముగ్గురు అక్కడ నుంచి పెరట్లో ఉన్న చెట్ల చాటుకు వెళ్ళారు. చుట్టలు అంటించారు. నోట్లో పెట్టుకుని గుప్పు గుప్పున పొగ వదలడం మొదలు పెట్టారు. ఎర్రచ్చమ్మకు అలా చుట్ట కాల్చడం అంత సంతృప్తి లేదు. చుట్ట కాలే భాగం నోట్లో పెట్టుకుని పొగంతా నోట్లోబంధిస్తుంది. తరువాత ఆ పీక నోట్లోంచి తీసి గుప్పు గుప్పున రైలు ఇంజనులా పొగవదులుతుంది.

ఆ ఇంటి పిల్లలే కాదు. పొరుగింటి పిల్లలు కూడా వచ్చి చాటు నుంచి ఆ ముగ్గుర్ని వింతగా చూసారు.

"ఒరేయ్! చూసారా ఎలాకాలుస్తున్నారో?"

"అవున్రా! అబ్బో అంత పొగ వస్తుందేటి?"

"అమ్మో! వీళ్ళు ఆడవాళ్ళు కాదురోయ్!"

"ఈ దంపుల్లాళ్ళు ఇంతేరా!"

బడి నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు చాటుగా వారిని చూస్తూ ఉంటారు. వారికి అదో విచిత్రం. అదో ఆశ్చర్యం. ఆ విచిత్రం చూడ్డం వారికి ఆనందం.

"వాళ్ళనేం చూస్తార్రా రండి లోపలికి రండి! రండి!" అని ఆ యింటావిడ కేకెయ్యడంతో పిల్లలంతా పరుగెత్తుతూ లోపలికి వచ్చేసారు.

చెట్ల చాటు నుంచి వస్తున్న ఆ పొగను ఆవిడ చూసి నవ్వుకుంది. వడ్లుదంచడానికి వచ్చినప్పుడల్లా వాళ్ళు ఆ పనిచెయ్యడం ఆవిడ చూస్తూనే ఉంటుంది. అయినా ఆవిడ చూసినప్పుడల్లా నవ్వుకుంటూనే ఉంటుంది.

"ఆహుం! ఆహుం! ఆహుం!"

చుట్ట కాల్చిన చేతులు, మూతి కడుక్కుని వచ్చి తిరిగి పోటు వెయ్యడం ప్రారంభించారు ఆ ముగ్గురు. వారికి పాటలు రావు. జ్వరం వస్తే బాధతో మూల్గినట్లు మూలుగుతారు. ఇది బాధ కాదు. ఆనందము కాదు. ఇష్టంతో కష్టపడే ఓ అనిర్వచనీయ శబ్ద తరంగమది.

ఇప్పుడు రోకళ్ళు ఒకదానితో ఒకటి సరితూగుతూ పడుతున్నాయి. ఆ ముగ్గరి చేతుల్లోని రోకళ్ళు ఆకాశంలోకి లేస్తూ కిందికి దిగి నేల రాతి గుంటలోకి పడుతున్నాయి. వడ్లను కాళ్ళతో ఆ గుంటలోకి తోస్తున్నారు. కనురెప్పలు ఎత్తి కిందికి వాల్చే లోపల మూడు రోకళ్ళు ఒకదాని తరువాత ఒకటి వడ్లగుంటలో పడుతున్నాయి. ఆ ముగ్గురు కలిస్తేనే ఒక యంత్రం. అది ఇంధనంతో నడవదు. వారి కాళ్ళు, చేతులతో వడ్లుదంచే మిల్లుల్లా నడుస్తున్నాయి. ఆ ముగ్గరికి విసుగులేదు అదో ఆనందం. ఓ 20 సం॥ల

నుంచి అలా వాళ్ళు ధాన్యం దంచుతూనే ఉన్నారు. ఊళ్ళో వాళ్ళకి దంపుళ్ళాళ్లు అనే పేరు. అది వృత్తి పరంగా వచ్చిన పేరు. ఆ మాట వారికి ఆనందమే. ప్రతి ఇరవై, రోజులకి ప్రతి ఇంట్లోను ధాన్యం దంచవలసి వస్తూనే ఉంటుంది. పంట చేలు ఉన్న వారి ఇళ్ళల్లోనే ధాన్యలక్ష్మి గాదుల్లో విశ్రాంతి తీసుకుంటుంది. భూములు లేని వారు దుకాణాల్లో బియ్యం కొనుక్కుంటారు. అక్కడ బియ్యం ఖరీదు చాలా ఉంటుంది. ఎంత ధర పెట్టినా బియ్యం నాసి రకంగా ఉంటాయి. పైగా కొత్త ధాన్యం వచ్చే రోజుల్లో పాత బియ్యం ధరతో కొత్త బియ్యం అంట గడతారు. ఎంత తక్కువ నీరు ఎసరుపెట్టినా అన్నం చిమిడి ముద్దవుతుంది. ఇది దుకాణదారుల మాయ. పాపం కొనుక్కున్నవారు లబోదిబో మన్నా పట్టించుకునే వారుండరు.

ధాన్యం పంట ఉన్న ఆసాములు పాతధాన్యం నిల్వ ఉంచుకుంటారు. కొత్త ధాన్యంతో గాదెలు నింపుకుంటారు. మరీ పాత ధాన్యం పురుటి బాలింతలకు, రోగులకు పత్యం వంటకోసం దంపించుకొని దాచుకుంటారు.

3 గం॥లకు ఆ ముగ్గురు ధాన్యం దంచడం పూర్తి చేసారు. బైట వరండాలో దంచిన ధాన్యం చేటలతో తెచ్చి చెరగడం మొదలు పెట్టారు. దంచిన ధాన్యం చెరిగి చిట్టు, దవుడు వేరు చెయ్యాలి. అప్పుడు చేటల్లో బియ్యం తెల్లగా తెల్లని ముత్యాల్లా కనబడతాయి. వాటిని మెరుగు పెట్టడానికి రాతిరోళ్ళలో మరోసారి దంచుతారు. మరోసారి చెరుగుతారు.

వీళ్ళు చేటల్లో పోసి బియ్యం చెరుగుతుంటే వీళ్ళ వేళ్ళు చేటల అడుగున తాకి మరో విచిత్ర శబ్దం వస్తుంది. ఆ శబ్దం ఏ వాయిద్యాన్ని అనుకరించదు. అలాగే వీరు రాతిరోళ్ళల్లో పోటు వేస్తుంటే ఆ శబ్దం కూడా మరో వింతగా వినిపిస్తుంది. బృందావనిలో పిల్లనగ్రోవులుగావు, నదీ తరంగాల మృదంగ నాదాలు కావు. వీనులకు విందుగొలిపే మానవ శ్రమ శక్తికి ప్రతీకగా వినిపించే శ్రవణానందకర మధుర నాదమది.

వాళ్ళు ఆరుబయట అలా బియ్యం చెరుగుతుంటే పిచ్చుకలు ఆ చేటలలోని బియ్యం నోట కరుచుకుపోవాలనుకుంటాయి. బియ్యం ఆ ముక్కు పుటాలతో అందుకో లేక వారి తలలమీద ఎగురుతున్నాయి. మరికొన్ని రకాల పిట్టలు మనుష్యులతో అంత సంబంధాలు లేక భయంతో కొంచెం పై నుంచి ఎగురుతున్నాయి. చెట్ల మీద కాకులు కావు కావు మంటూ అరుస్తున్నాయి. నేల మీద పడ్డ నూకల్ని ఏరుకోడానికి కోడిపిల్లలతో వాళ్ళ చుట్టూ తిరుగుతోంది కోడి, పిల్లలయితే మధ్య మధ్యలో వాళ్ళ కాళ్ళకే అడ్డు పడుతున్నాయి.

అది చూసిన వీరమ్మ చేటలో వెనకకున్న తౌడుతో కలిసిన నూకల్ని నేల మీద ఓ వారగా పోసింది. కోడి పిట్ట పిల్లలు అటు పరుగెత్తాయి. ఎక్కడ నుంచో తలను వయ్యారంగా ఊపుకుంటూ కోడిపుంజు అక్కడ చేరింది. అక్కడ చేరిన పిల్లలు వాటిని తరుముకుంటూ పరుగులు పెడుతున్నారు.

చీకటి పడేవేళకు అన్ని పనులు పూర్తి చేశారు. వీరమ్మ బియ్యం కుంచంతో కొలిచి డబ్బాలో పోసింది. ఇంటావిడ ఓ ముక్కాలి పీట వేసుకుని ఎదురుగా ఠీవిగా కూర్చుంది. యజమానురాలికి పెత్తనం చేసే ఠీవి అదే వచ్చేస్తుంది.

ఎర్రచ్చమ్మ నూకలు కొలిచి వెదురు వేళ్ళ బుట్టలో పోసింది. తోటచ్చమ్మ ఆ నేలంతా తుడిచి శుభ్రం చేసి చిట్టూ తవుడూ వేరు వేరు బస్తాల కెత్తింది. అప్పుడే పాలేరు వచ్చి చిట్టు, తవుడు కలిపి పశువులకు మేతగా వెయ్యడానికి వెళ్ళాడు.

ఆ ముగ్గరికి రావలసిన కూలి బియ్యం కొలుచుకున్నారు. కొన్ని నూకలు కూడా కొలిపించింది ఆవిడ. మొదట్లో కూలికి వడ్లే కొలిచి యిచ్చేవారు. వాటిని దుకాణంలో అమ్ముకుని డబ్బులు తీసుకునేవారు. కాని ఇప్పుడు బియ్యమే పుచ్చుకుంటున్నారు.

''రెండు రోజులు పోయాక నూకలు నానపెట్టి పిండిదంచాలి'' యజమానురాలు తిరిగి పని చెప్పింది.

ఆ ముగ్గురు 'సరే' అన్నట్టుగా తలలూపుతూ 'ఇగ ఎడతామమ్మా!' అన్నారు. ఆ వూళ్ళో 'దంపుళ్ళాళ్లు' అంటే ఆ ముగ్గరే.

పదిహేను రోజుల నుంచి వరుసగా వడ్లు దంచడానికి వెడుతూనే ఉన్నారు. ముగ్గురిలో తోట అచ్చమ్మ వయసులో పెద్దది. పైగా కాస్త పొడవరి, దానికి తగిన వళ్ళు ఉంది. ఎత్తరి వాళ్ళకి కాస్త అలసట ఎక్కువంటారు. ఆమెకు అదే జరిగింది. భుజాలు నడుములు ఒకటే పోట్లు. వాటికి సాయం కాస్త జ్వరం కూడా తగిలింది. తోట అచ్చమ్మ మంచం దిగలేకపోయింది. మరునాటికి జ్వరం మరింత పెరిగింది. ఆచారిగారి దగ్గర మందుతెచ్చి వీరమ్మ సేవ చేస్తోంది.

''ఆ వూళ్ళో తనలాగే తన కొడుకు, కోడలు ఏ లోటు లేకుండా బతకాలి. తన అనంతర మందు తన కోడలు తన రోకలి అందుకుని పని చెయ్యాలి. అది అచ్చమ్మ కల. తన కోరిక నెరవేరుతుందో లేదో అచ్చమ్మకు బెంగ కూడా ఉంది. అయినా తన కల నిజమవుతుందనే ఆశతోనే బతుకుతోంది.

ఎర్రచ్చమ్మ తూర్పు నుంచి వచ్చింది. శ్రీకాకుళం దగ్గరలో ఉన్న బుడ్డిపాలెం ఆమెది. బతుకు తెరువుకోసం భర్త, ఇద్దరు పిల్లలతో గోదావరి తీరం చేరింది. తూర్పు గోదావరిలో పంట లెక్కువ. బొబ్బర్లంక దాటి ఓ పల్లెలో స్థిరపడ్డారు. మొగుడు పొలంపని చేసుకునేవాడు. ఎర్రచ్చమ్మకి తోటచ్చమ్మతో, వీరమ్మలతో పరిచయ మయింది. అప్పటికే తోటచ్చమ్మ, వీరమ్మ రాజమ్మలు ధాన్యం దంచే వారు. వారితో ఎర్రచ్చమ్మ కూడా కలిసింది. అంత క్రితం అక్కడ కూడా అంతధాన్యం పంట ఉండేది కాదు. క్రమంగా ఎరువులు వల్ల, వ్యవసాయంలో కొత్త మెలకువల వల్ల ధాన్యం మరింతగా పండించటం మొదలు పెట్టారు. ఆ చుట్టుపక్కల అంతా సిరిగల ప్రాంతంగా పేరు వచ్చింది.

ఆ నలుగురు దంపుళ్ళాళ్ళుగా పేరు పడ్డారు. వీరమ్మది కూడా ఆవూరు కాదు. ఆ చుట్టు పక్కల ఏదో వూరు. ఆమెకు పెళ్ళయిందో లేదో ఎవరికీ తెలీదు. కొందరు పెళ్ళయింది కాని భర్త వదిలేసాడు అంటారు. ఏదైనా సంతానం కూడా లేదు. ముందు వెనుక ఎవరు లేరు. ఈ వూరు వచ్చాక తోట అచ్చమ్మతో కలిసి రోకలి పట్టింది. రాజమ్మ, అప్పటికే ఆ వూళ్ళో తోటచ్చమ్మతో కలిసి ధాన్యం దంచేది. ఇద్దరికి ముగ్గురు తోడయ్యారు. ఎత్తిన రోకలి దించకుండా ముగ్గురి చేతినిండా పనే. తోట అచ్చమ్మది అసలు ఆ వూరే. ఆ వూరు ముందుభాగంలో పెద్దతోట ఉంది. ఆ తోట మధ్యలో ఓ చెరువు. తోట ముందు తోట కాపలాకాసె నరసయ్య, భార్య అచ్చమ్మ కాపురముండే ఓ తాటాకుల కొంప. నరసయ్య తండ్రి, తాత కూడా అక్కడ బతికినవాళ్ళే. వాళ్ళ తరం గడిచింది. ఇప్పుడు నరసయ్య తరం. ఆ తోటలో ఉండబట్టే తోటచ్చమ్మ, తోట నరసయ్య పేర్లు అందరి నోళ్ళల్లో అలవాటు పడిపోయారు. తోట అచ్చమ్మకి ఓ కొడుకు, కూతురు పుట్టారు. కూతురు 8 ఏళ్ళు రాకుండానే చనిపోయింది. ఆ కాలంలో పండే సీమ చింతకాయలు ఎక్కువ తినేది. అందుకే వాతం కమ్మి చనిపోయిందని ఊరిడి మంది అనుకున్నారు. అచ్చమ్మ కూతురి మీద ప్రేమతో చాలా రోజులు ఏడుస్తూనే ఉంది. దాని మూలంగా ఆమె కళ్ళల్లో పువ్వులేసాయి. ఆ కాలంలో ఇంగ్లీషు డాక్టర్లు లేరు. నాటు వైద్యమే. ఓ కంటిలో పువ్వు తగ్గిపోయింది. మరో కన్ను పూర్తిగా నయం కాలేదు. చూపు కాస్త మందగించింది. అయినా పోటు మాత్రం బాగా వేస్తుంది. సంసారం హాయిగా సాగిపోతోంది.

తోట నరసయ్య ఒక రోజు తోటలో పనిచేస్తుంటే పాము కరిచి చనిపోయాడు. మంత్రగాళ్ళ మంత్రాలు పని చెయ్యలేదు. కొడుకు ఆమె ఆ తోటలోనే ఉన్నాడు. భర్త పోయాక తోట అచ్చమ్మ రవిక తొడగడం ఆచారం ప్రకారం మానేసింది.

కొడుక్కి 18 సం॥ వచ్చాయి. పెళ్ళి చెయ్యాలనుకుంది. వాడికి తోట పని నచ్చలేదు. బొంబాయిలో ఉద్యోగాలు దొరుకుతున్నాయి అంటూ కొందరు యువకులు ప్రయాణమయ్యారు. అచ్చమ్మ మాటవినిపించుకోకుండా వాడు కూడా బొంబాయి ప్రయాణమై వెళ్ళిపోయాడు. అచ్చమ్మ ఒక్కగానొక్క కొడుకు దూరమయ్యాక ఏడ్చి ఏడ్చి గుండె రాయి చేసుకుంది.

కొడుకు తిరిగి వస్తాడని ఆశతో తోట అచ్చమ్మ వడ్లు దంచేపని మరింత చేస్తోంది. డబ్బు కూడా బాగానే పోగు చేసుకుంది. ఆ తోట యిల్లు వదలి వీరమ్మ ఇంటి పక్కనే ఓ గుడిసెలోకి వచ్చేసింది.

రాజమ్మ అందరికంటే పెద్దది. ముసలిదైపోయింది. ధాన్యం దంచే పని క్రమంగా మానేసింది.

ఎర్రచ్చమ్మ ఇద్దరి పిల్లలకి పెళ్ళిళ్ళు అయ్యాయి. బంధువులంతా అక్కడే ఉండడంవల్ల సంబంధాలు రెండూ అటే తూర్పున కుదిరాయి. పెళ్ళిళ్ళు అయ్యాక కొడుకు కోడలి వెంట వెళ్ళిపోయాడు. కూతురు అత్తారింటికి వెళ్ళిపోయింది. మగడు కాస్త ముసలివాడు. జబ్బుచేసి అతను చనిపోయాడు. పిల్లలు రమ్మన్నా వెళ్ళలేదు. "రెక్కలు ఇరిగిన్నాడు వత్తారా!" అంది కొడుకుతో. ఈమె మొగుడు పోయాక రవికమానేసింది. పచ్చటిరంగు, మెడలో పట్టెడు, చెవులకి, ముక్కులకి పోగులు. చిన్న అడ్డ బాస. అవి ఆమెకు ఓ ప్రత్యేక అందాన్ని తెచ్చి పెట్టాయి.ఆమె ఎర్రగా ఉండడంవల్లే ఆ వూళ్ళో 'ఎర్రచ్చమ్మ'ని పిలిచేవారు. వీరమ్మ చెవులకి, ముక్కులకి, మెడలో అన్నీ గిల్టు నగలే. ఆ నగలు పెట్టుకోడం ఆమెకు ఓ సరదా! నగలు నల్ల పడినా గిల్టురాళ్ళు గుడ్డిగా మెరుస్తూనే ఉంటాయి.

వారం రోజులకి జ్వరం పూర్తిగా తగ్గి తోట అచ్చమ్మ లేచి తిరగగలిగే స్థితికి వచ్చింది. ఆ రోజు ఓ పిడుగుపాటు లాంటి వార్త ఊరంతా గుప్పుమంది.

"ఈ వూళ్ళో ధాన్యం మిల్లు కడతారుట! ధాన్యం దంపవలసిన పనేలేదుటి. ఇక రోళ్ళు, రోకళ్ళు అక్కర లేదుట. బస్తాల కొద్దీ ధాన్యాన్ని మిల్లు ఆడేస్తుందిట!" ఎక్కడ చూసినా జనం గుంపులుగా నిలబడి చెప్పుకుంటున్నారు.

ఆ వార్త వినగానే ఆ ముగ్గురి గుండెల్లో రాళ్ళు పడ్డాయి. "మన పొట్టలు కొట్టడానికే ఈ ధాన్యం మిల్లు వస్తున్నట్టుంది" అనుకున్నారు ముగ్గురు బాధగా.

వారికి చెప్పలేని బెంగ ప్రారంభమయింది. "ఆపద వచ్చి మీద పడుతుంటే అనుభవించ వలసిందే" అని అనుకున్నా తోట అచ్చమ్మ మంచంమీద ఉండగానే మిగిలిన ఇద్దరు వెళ్ళి నాన పెట్టిన నూకలు పిండికొట్టి వచ్చారు. ధాన్యం దంపమని చాలా మంది కబురు పెట్టారు. ఆ ఇద్దరు కలిసి ధాన్యం దంపడం చాలా కష్టం. తోట అచ్చమ్మ త్వరగా కోలుకోవాలని అమ్మవారికి మొక్కుకున్నారు కూడా. తీరా ఆమె కోలుకునేటప్పటికి ఇటువంటి వార్త వచ్చింది. తన కొడుకు బొంబాయి నుంచి తిరిగి రానేలేదు. ఇప్పుడు తనచేతి రోకలి మూలపడే పరిస్థితి ఎదురయింది. ఇంక తన కోరిక నెరవేరదు, తన కల నిజమయ్యే దారి లేదు. గాలి పోయిన రబ్బరు బంతిలా నేల మీద కూలబడిపోయింది అచ్చమ్మ.

"అచ్చమ్మ ఉన్నదా?"

"ఆ! వున్నదయ్యా! తమరే వచ్చినారేటి?" ఓ యింటి యజమానిని చూసి ఆశ్చర్యంగా అడిగింది ఎఱ్ఱచ్చమ్మ, తోటచ్చమ దగ్గరే వీరమ్మ, ఎఱ్ఱచ్చమ్మ కూర్చుని ఉన్నారు.

"పొద్దుగాలే రాండి! వడ్లు దంచాలా!" ఆ మాట చెప్పి ఆయన పనై పోయినట్లు వెళ్ళిపోయాడు.

ముగ్గురి కళ్ళు ఆనందంతో మతాబుల్లా వెలిగాయి. సంతోషం పట్టలేక ఉక్కిరి బిక్కిరయ్యారు. వారికి నోట మాటే కాసేపటివరకు రాలేదు. "దేవుడు మనకోసమే ఉన్నాడు" అనుకుని తృప్తి పడ్డారు. ఆ రాత్రి వారి కంటికి కునుకేలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా? అని ఎదురు చూస్తూనే ఉన్నారు. వెలుగు రాకుండానే లేచారు. కలోగంజో తాగి, అన్నం మూటలు సర్దుకున్నారు. సూర్యునితో పోటీపడుతూ ముగ్గురు పనికి బయలు దేరారు. ముగ్గురు పదునైన రోకళ్ళు తయారు చేయించుకున్నారు. ఎక్కడికి వెళ్ళినా ఆ రోకళ్ళు భుజాన పెట్టుకునే బయలుదేరుతారు. రైతుల భుజాన నాగళ్ళలా వీళ్ళు భుజాన రోకళ్ళు మరిచిపోరు. కనపడ్డవాళ్ళ నందరిని ధాన్యం మిల్లు సంగతి అడుగుతూనే ఉన్నారు.

"అప్పుడే వత్తాదా ఏటి? మిల్లు కట్టాలా! మిషన్లు రావాలా! ఓ ఏడాదవుద్ది!" వాళ్ళ సమాధానం విన్న ఆ ముగ్గురు ఇప్పట్లో ఏం కాదన్న మాట!" అని అనుకున్నారు. వారి మనస్సులు కాస్త కుదుట పడ్డాయి.

ఆ ఇంట్లో పెళ్ళిట. నాలుగు రోజులు ధాన్యం దంచుతూనే ఉన్నారు. తర్వాత వరి పిండి దంచారు. విసుర్రాయి మీద కందిపొడి, ధనియాలపొడి వగైరాలు విసిరారు చేతినిండా పనే.

అది పెళ్ళిళ్ళ కాలం, ఆ యింట్లో పని కాగానే మరో యింట్లో . అలా రెండు నెలలు చేతుల నిండా దంపుళ్ళ పనే. ముగ్గురి చేతుల నిండా డబ్బే. వీరమ్మ జాగ్రత్తగా దాచుకుంది.

ఎర్రచ్చమ్మ కూతురు పురుటి కొచ్చింది. కోడలు చంటిపిల్లాడిని చంకన వేసుకు వచ్చింది. చేతిలో ఉన్న డబ్బు బాగానే ఖర్చు పెట్టింది. వేడుకలు బాగానే జరిపించింది. బొంబాయి నుంచి తోటచ్చమ్మ కొడుకు వచ్చాడు. బంధువులంతా పెళ్ళి చెయ్యమని పట్టుపట్టారు. తమ్ముని కూతురితో కొడుకు పెళ్ళి జరిపించేసింది.

"కొద్ది కాలంలోనే తిరిగి వత్తానమ్మా! బెంగపడబోక" అంటూ తల్లికి నచ్చచెప్పి తోటచ్చమ్మకొడుకు పెళ్ళాన్ని తీసుకుని బొంబాయి వెళ్ళిపోయాడు. తిరిగి వస్తాడని కొండంత ఆశతో కొడుకుని సాగనంపింది ఆ తల్లి. దొరికిందే సమయమని ఆ ముగ్గురు ధాన్యం దంపుడు బాగానే చేస్తున్నారు. డబ్బు దాచుకుంటున్నారు. డబ్బుతోటె లోకం అన్నట్లుగా పడిన కష్టం మరిచిపోతున్నారు.

ధాన్యం మిల్లు కట్టడం పూర్తయింది. అనుకున్నదానికంటె ముందుగానే మిల్లు ధాన్యం ఆడటం ప్రారంభించింది. చాలామంది ఈనాందారులు ధాన్యం ఆడించి బియ్యం అమ్మకానికి పట్నం పంపేస్తున్నారు. మిల్లులో ఆడిన బియ్యం తెల్లగా మెరిసిపోతున్నాయి. వారికి బోలెడు లాభం వస్తోంది.

దంపుడు బియ్యం ఆరోగ్యమని ఇళ్ళల్లో వండుకోడానికి ధాన్యం దంపించు కుంటున్నారు. మిల్లు బియ్యం వాతమని అందులో సారముండదని చాలామంది అనుమానం. కొత్తగా ఏది వాడుకలోకి వచ్చినా చాలా మంది స్వీకరించరు. వారి మనసు అంగీకరించదు. అది మానవ స్వభావం. దేనికైనా అలవాటు పడాలి.

ఆ ముగ్గురు పనికి ఏ ఆటంకం లేకుండా పని సాగుతూనే ఉంది. అయినా 'కొత్త వింత పాత రోత' అన్న పెద్దల మాటే ఆచరణలోకి వచ్చింది. క్రమంగా అందరూ ధాన్యం మిల్లుల్లోనే ఆడించుకోడం మొదలు పెట్టారు. అయినా మిల్లు నుంచి ఆడించి వచ్చిన బియ్యం చెరగాలి. నూకలు వేరు చెయ్యాలి. పిండి కొట్టాలి అలా ముగ్గురికి పని దొరుకుతూనే ఉంది.

అయినా ఆ ముగ్గురికి తృప్తిగా లేదు. ముగ్గురు బెంగపెట్టుకున్నారు. చేతుల్లో అనుకున్నంత పనిలేక దిగాలు పడిపోతున్నారు.

ధాన్యం దంచే రాతిగుంటలు చాలా మంది తీయించేసి అక్కడ గచ్చు చేయించేసారు. రాతి రోళ్ళు మూలపడ్డాయి. రోకళ్ళు కూడా మూల పడ్డట్టే. ఎపడో

పిండి దంచడానికే వాటి అవసరం. అటుకులు దంచే రాతిరోకళ్ళు మూలకెళ్ళాయి., రెడీమేడ్ అటుకులే వచ్చాయి.

ఆ ముగ్గురికి ఈ బెంగలో ముసలితనం మీదపడినట్లయింది. ఇంక చేసేది ఏమీ లేదు. ఊళ్ళో అందరు వారి చుట్టూ తిరిగేవారు. ఇప్పుడు వాళ్ళని పట్టించుకునేవారు లేరు. వీరమ్మ తన రోకలి తోట అచ్చమ్మకే ఇచ్చేసింది. వీథుల్లో టీ బట్టీ పెట్టుకుంది. ఏ ఎండకు ఆ గొడుకు పట్టే స్వభావం ఆమెది. ఇప్పుడు ఆమె బిజీ ఆమెది. ఆమె సంపాదన ఆమెది.

ఎర్రచ్చమ్మ పిల్లలు వచ్చి ఆమెను తిరిగి వాళ్ళ ఊరికి తీసుకు వెళ్ళిపోయారు. ఆ రోకలి కూడా తోటచ్చమ్మ ఇంట పెట్టేసింది.

తోటచ్చమ్మ కంటికి కునుకు లేదు. రోకళ్లను చూస్తే ఆమెగుండె చెరువవుతోంది. చేటతో బియ్యం చెరుగుతుంటే పిచ్చుకలు, పిట్టలు చుట్టూ తిరిగేవి. కోడి పిల్లలు కాళ్లకు అడ్డుపడేవి. ఆ దృశ్యం ఆమె కళ్ళముందు సినీమా రీలులా తిరుగుతోంది. తనకు ముసలితనం వచ్చేసింది.

తన రోకళ్ళు ఇంక మూల పడతాయి. తన కల కలగానే మిగిలిపోతుంది. తను ఒంటరిది. తన ప్రాణం ఎప్పుడో గుటుక్కుమంటుంది. తన కొడుకు మోసం చేసాడు. ఇంక తన బతుకు గాలిలో దీపంలా ఎప్పుడో ఆరిపోతుంది. తన కోరిక ఆ గుడిసె చుట్టూ తిరుగుతూ ఉంటుంది... అనుకుంటూ అచ్చమ్మ బాధపడింది. బెంగపెట్టుకుని చిక్కి సగమయింది.

పిండి కూడా పోటెయ్యలేదు. అంతలో ఒక నాడు కొడుకు, కోడలు బొంబాయి నుంచి బయలుదేరి వచ్చారు.

"నే వచ్చేసినా! ఓ యమ్మా! నీకు నేనున్నానే" అన్నాడు కొడుకు

బొంబాయి నుంచి వచ్చాడని వెంటనే అతనికి రైసు మిల్లులో ఉద్యోగం ఇచ్చారు. అచ్చమ్మ సంతోషం సగంలోనే ఆగిపోయింది.

"ఓ యత్తా! నే పిండి దంచుతా! పసుపు దంపుతా! కుంకుమ తయారు చేసి పట్నంలో అమ్ముతా! ఓ యత్తా నేనున్నాగా!" అంది కోడలు. అత్తకు కొండంత ధైర్యం వచ్చింది.

"అబ్బో ఈ రోకళ్ళు పదునుగా ఉన్నాయి. నా పనికి బాగా పనికొత్తాయె" అంది కోడలు. తన కల నిజమవుతోంది. ఆ ముసలి ప్రాణం ఆనందంతో ఉక్కిరి బిక్కిరయింది.

రోకళ్ళ వైపు తృప్తిగా చూసింది అచ్చమ్మ. ఎప్పటికోకాని తోటచ్చమ్మ కళ్ళు మూతలు పడలేదని ఆ కొడుక్కి, కోడలికి తెలియలేదు.

అచ్చమ్మ తన కోరిక నెరవేరుతోందని సంతోషం పట్టలేకపోయింది. ఆ సంతోషంలో ఎండిన ఆమె శరీరం నుండి ప్రాణాలు ఎప్పుడో అనంత వాయువుల్లో కలిసి పోయాయి.

"కొడుకు కోడలు తిరిగి వచ్చారు. అచ్చమ్మ మనసంతా ఆ రోకళ్ళ మీదే ఉండేది. కోడలు రోకలి ఎత్తుతానంది. అచ్చమ్మ కల నెరవేరింది. అదృష్టవంతురాలు" అనుకున్నారు అచ్చమ్మకు కావలసిన వాళ్ళంతా!

కొడుకు, కోడలు అచ్చమ్మ శవం మీదపడి బావురు మన్నారు.

పత్రిక మాసపత్రిక

*నవంబరు 2004, ప్రత్యేక సంచిక.*